క్లుప్తంగా

అంబేద్కర్ భవనం నిర్మించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలో అంబద్కర్ భవనం నిర్మించి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సురేష్ సుమాల కోరారు. శనివారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని ఆయన నివాసంలో కలిసి సంఘ నాయకులు సురేష్ సుమాల, ముత్తు సుమాల, హనుమన్న, రామకృష్ణ, అబ్రహం, గుమ్మల ప్రసాద్, సోమన్న, చిన్న హనుమంతు వినతిపత్రం ఇచ్చారు.

సరిహద్దు రాళ్ల ఏర్పాటు

నందవరం: జగనన్న భూహక్కు- భూ రక్ష సర్వేలో భాగంగా సర్వే పూర్తియిన గ్రామాల్లో సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ నిత్యానందరాజు తెలిపారు. శనివారం మండలంలోని మిట్టసోమపురం భూముల్లో సరిహద్దు రాళ్ల ఏర్పాటును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో భూవివాదాలకు తావులేకుండా సరిహద్దుల వద్ద రాళ్లు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అబ్బర్‌బాషా, గ్రామ సర్వేయర్లు ముగతి శేఖర్, శ్రీకాంత్, ఆరోణి, రాజేష్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు

నందవరం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామాల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నయని డాక్టర్ చంద్రకాంత్ యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సచివాలయం-2 ఆవరణలో గర్భిణులు, బాలింతులు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదోడికి వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ శాంతమ్మ, ఏఎన్ఎం దేవిప్రియ, హెల్త్ అసిస్టెంట్ ఫారుక్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామ శివారులో పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన బోయ పెద్దయ్య, కొడి అన్నెప్ప, గొల్ల రామాంజనేయులు, మాదిగ శంకర్, బోయ పరమేష్, బోయ మాణిక్యంలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.20,350 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అలాగే పందిర్లపల్లె గ్రామ శివారులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఈడిగ రామాంజనేయులు గౌడ్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 36 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల గ్రామంలో శనివారం సాయంత్రం ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు. గ్రామ పరిసరాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావటంతో దాడి చేసి పట్టుకున్నామని, వారి వద్ద నుంచి రూ. 2,500 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

అనాథ శవానికి అంత్యక్రియలు


అంత్యక్రియలకు తీసుకెళ్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన మాదుగుండు ఈరమ్మ అనే మహిళ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందింది. ఆమెకు నా అనే వారు ఎవరూ లేకపోవడంతో స్థానిక అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, బీసీ సంఘాల వారు స్పందించి శనివారం స్థానిక కుర్ణి స్మశాన వాటికలో అంత్యక్రియలు చేశారు. ఆయా సంఘాల నాయకులు సింగనేటి నరసన్న, కామలే గణేష్, కెఎం బతకన్న, ప్రసాద్, రామచంద్రులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో లక్ష్మీవెంకటేశ్వరస్వామి రథోత్సవం శనివారం తెల్లవారుజామున కనుల పండువగా జరిగింది. శుక్రవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

వెల్దుర్తి: స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్ పదవ తరగతి విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న మాదిగ శనివారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ఉస్మాన్ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

హొళగుంద: సుళవాయి గ్రామంలో ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం సమితి మండల అధ్యక్షుడు ఎల్లార్తి అర్జున్ ప్రారంభించారు. కార్యక్రమంలో సుళవాయి సర్పంచ్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మున్సిపాలిటీలలో ఎమ్మిగనూరు ప్రథమ స్థానంలో నిలిచింది. సచివాలయ వ్యవస్థ ద్వారానే ఈ ఘనత సాధ్యమైంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన పన్ను లక్ష్యాలను 92 శాతం సాధించింది. ఇక కర్నూలు 87.80 శాతం, గూడూరు 81.50 శాతం, ఆదోని 81.40 శాతంతో రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి.



పన్ను వసూళ్లలో ఎమ్మిగనూరుదే ప్రథమ స్థానం

- మున్సిపాలిటీలో రూ.4.02 కోట్లు వసూళ్లు
- మార్కెట్ వేలాల సొమ్ము వసూళ్లలోనూ అదే జోరు


ఆస్తిపన్ను చెక్కును మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి అందజేస్తున్న స్పిన్నింగ్‌మిల్లు యజమాని

ఎమ్మిగనూరు: లక్షా ఇరవై వేలమంది జనాభా ఉన్న ఎమ్మిగనూరు స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ పరిధిలో 34 వార్డులు ఉన్నాయి. 22,351 నివాస ప్రాంతాలు ఉన్నాయి. నివాసయోగ్యమైన ప్రాంతంగా, వ్యాపార వాణిజ్య రంగాల పురోగామి ప్రాంతంగా ఎమ్మిగనూరుకు గుర్తింపు ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రవేట్ బిల్డింగ్ యాజమాన్యుల నుంచి రూ.4.36 కోట్లు రెవెన్యూ వసూళ్లు చేపట్టాలని మున్సిపాలిటీకి లక్ష్యాన్ని నిర్దేశించారు. పట్టణంలో 26 వార్డు సచివాలయాలు ఉన్నాయి. సచివాలయ సిబ్బంది, రెవెన్యూ విభాగం అధికారుల సమన్వయంతో పన్ను వసూళ్లు చేపట్టారు. మున్సిపల్ అధికారులు మైక్ అనౌన్స్‌మెంట్, ప్రభుత్వం ఆస్తి పన్నుపై ఉన్న వడ్డీ రాయితీ ప్రకటించటంతో పన్ను వసూళ్లకు విశేష స్పందన వచ్చింది. మార్చి 31 నాటికి రూ.4.02 కోట్ల ప్రవేట్ ఆస్తి పన్ను వసూళ్లు జరిగాయి. జిల్లాలోని మున్సిపాలిటీల్లో రెవెన్యూ వసూళ్లలో ఎమ్మిగనూరు ప్రథమ స్థానంలో నిలిచింది. 2021-22లో రూ.3.62 కోట్లు, 2020-21లో రూ.3.59 కోట్లు వసూలు అయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.అరకోటికిపైగానే అదనంగా వసూలైంది.

మార్కెట్ వేలాల రుసుం వసూళ్లలోనూ..

మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ వేలాల రుసం వసూళ్లలోనూ అదే జోరు కొనసాగింది. మున్సిపాలిటీ పరిధిలో రోజువారి మార్కెట్, వారపు సంత, గొర్రెల మార్కెట్, మటన్ మార్కెట్, వారపు పశువుల మార్కెట్లను వేలంపాట ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగిస్తారు. ఈ మార్కెట్ల ద్వారా 2022-23 సంవత్సరానికి గానూ వేలంపాటదారుల నుంచి రూ.66,20,000లకు గాను రూ.50,55,333లు వసూలయ్యాయి. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.68,17,000లకు మార్కెట్ వేలాలు దక్కించుకున్న వేలం పాటదారుల నుంచి ముందస్తుగానే యాభై శాతానికిపైగా రూ.35,04,000లు అడ్వాన్సు రాబట్టుకున్నారు.

రూ.58.20కోట్లతో వార్షిక బడ్జెట్..

ఎమ్మిగనూరు పట్టణాభివృద్ధి కోసం రూ.58.20 కోట్లతో వార్షిక బడ్జెట్ ప్రణాళికలు రూపొందించారు. ఏప్రిల్ 1 నుంచి వార్షిక బడ్జెట్ అమల్లోకి వచ్చినట్లు మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. వార్షిక బడ్జెట్‌ను పరిశీలిస్తే 2023-24 సంవత్సరపు ప్రారంభ నిల్వ మొత్తం రూ. 27,75,30,620లు, వివిధ పన్నుల రూపంలో వచ్చే సాధారణ జమలు రూ.22,97,86,500లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే మూలధనపు జమలు రూ.7,47,50,000లు కలిపి మొత్తం బడ్జెట్ జమ అంచనాలు రూ.58,20,67,120. అందులో వచ్చే ఆర్థిక సంవత్సరంలో సాధారణ ఖర్చుల కింద రూ.15,61,42,200, మూలధనపు ఖర్చులు రూ.14,43,85,000, లోన్ చెల్లింపులు రూ.40,00,000 కలిపి మొత్తం ఖర్చు రూ.30,45,27,200. బడ్జెట్‌లో ముగింపు నిల్వలుగా రూ.27,75,39,920లుగా చూపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతోపాటు మున్సిపాలిటీ సాధారణ నిధులు కలిపి మొత్తం రూ.13,67,85,000లతో మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

సమష్టి సహకారం



వార్డు సచివాలయాల సిబ్బంది, మున్సిపల్ రెవెన్యూ విభాగం సమష్టి సహకారంతో పన్ను వసూళ్లు చేపట్టాం. 92 శాతం వసూళ్లతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే ఎమ్మిగనూరు ప్రథమ స్థానంలో నిలవటం సంతోషంగా ఉంది. ఇదే స్ఫూర్తితో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘుల సహకారంతో పట్టణంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం.

– ఎన్ గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్

గడ్డివామి దగ్ధం

ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి గ్రామంలో గడ్డివాము దగ్ధమైంది. ఆలూరు ఫైర్ అధికారి ఖాద్రి తెలిపిన వివరాలు.. గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన రైతు పాలకప్ప ఇటీవల రూ.15 వేలు వెచ్చించి పశుగ్రాసం తెచ్చుకుని వామిగా ఏర్పాటు చేసుకున్నాడు. శనివారం ఉదయం ప్రమాదశాత్తూ నిప్పంటుకుంది. గమనించిన కాలనీ వాసులు ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మంటలు అదుపుచేసేలోపు గ్రాసం దగ్ధమైంది.

కడివెళ్ల గ్రామంలో..

ఎమ్మిగనూరురూరల్: ట్రాక్టర్‌పై తరలిస్తున్న వరిగడ్డికి విద్యుత్ తీగలు తాకి నిప్పంటుకుంది. ఈ ఘటన శనివారం కడివెళ్ల గ్రామం మాలగేరిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మాధవస్వామి గ్రాసం కొనుగోలు చేసి ట్రాక్టర్‌పై తరలిస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. డ్రైవర్ ట్రాక్టర్ ఇంజిన్ నుంచి ట్రాలీని వేరుచేయటంతో పెనుప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బందితో కలిసి గ్రామస్తులు మంటలు ఆర్పివేశారు. దాదాపు రూ.20 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

అభినందన సభకు తరలిరండి

గోనెగండ్ల: కర్నూలులో ఆదివారం నిర్వహించనున్న అభినందన సభను విజయవంతం చేయాలని వాల్మీకి సంఘం జిల్లా కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మురళి నాయుడు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎస్టీలో చేర్చాలనే వాల్మీకుల కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాకారం చేయబోతున్నారన్నారు. ఆయనకు కృతజ్ఞతగా తలపెట్టిన సభకు తరలిరావాలన్నారు.

ప్రజాసమస్యలపై పోరాటం

పత్తికొండ రూరల్: ప్రజా సమస్యలపై పోరాడతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. శనివారం స్థానిక చదువుల రామయ్య భవన్‌లో సీపీఐ మండల సమితి సమావేశాన్ని పట్టణ కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భీమలింగప్ప, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత దగ్గరకావాలి

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం, సమావేశానికి హాజరైన జేసీఎల్ ఇన్‌చార్జ్‌లు, నాయకులు

ఆలూరు: ప్రభుత్వం చేస్తున్న మేలును వివరిస్తూ ప్రజలకు మరింత దగ్గర కావాలని సచివాలయాల జోనల్, మండల కన్వీనర్లకు, ప్రజాప్రతినిధులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సచివాలయాల జోనల్, మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షే పథకాలను ఇంటింటికి వెళ్లి చెప్పాలన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటకే పాలన తీసుకొచ్చిన విషయాన్ని ప్రజలకు గుర్తుచేయాలన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందజేస్తున్న తీరును వివరించాలన్నారు. సంక్షేమ పథకాలన్నీ అమలు కావాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకోవాలని ప్రజలకు సూచించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నేత గుమ్మనూరు నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, దేవనకొండ, హొళగుంద ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండలకన్వీనర్లు, సింగిల్ విండో అధ్యక్షులు, రమాదేవి, రంగమ్మ, లక్ష్మీదేవి, నెట్టకంటమ్మ, హేమలత, వీరేష్, పెద్దయ్య, నారాయణ, భీమప్ప, మల్లికార్జున, షఫీఉల్లా, ఏరూరు శేఖర్, రామకృష్ణ, లింగప్ప, శ్రీనివాసులు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు

పేదలు బాగుపడితే ప్రతిపక్షాలకు కడుపుమంట

- పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


ఇంటిపట్టాలు అందుకుంటున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: పేదలు బాగుపడుతుంటే ప్రతిపక్షాల నాయకులకు కడుపుమంటగా ఉందని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మండల కేంద్రానికి చెందిన 504 మందికి మంజూరైన ఇంటి స్థలాల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం మద్దికెర కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా 20 మందికి ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. మిగతా వారికి ఒకటి, రెండు రోజుల్లో అధికారులు అంజేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ టీడీపీ నాయకులు తమ పబ్బం గడుపుకోడానికి పేదలకు ఇంటి పట్టాలు అందకుండా కోర్టులకెక్కినా చివరికి న్యాయమే గెలిచిందన్నారు. ఇంటి స్థలాలు రాని ప్రజలెవరూ ఆందోళన చెందొద్దని, సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ 90 రోజుల్లోపు స్థలం మంజూరవుతుందన్నారు. స్థలాల మంజూరు కోసం ఎవరికీ డబ్బు ఇవ్వొద్దన్నారు. ఇల్లు నిర్మించుకోడానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇస్తుందన్నారు. కుల, మత, రాజకీయాలకు తావులేకుండా ప్రతి పేదవారికి సంక్షేమ ఫలాలు అంజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలిని ఆమె కోరారు. పట్టాల పంపిణీకి కృషి చేసిన తహసీల్దార్ నాగరాజును అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సర్పంచులు సుహాసిని, మల్లికార్జున, విజయుడు, మార్కెట్‌యార్డు చైర్మన్ పక్కీరప్ప, ఉపసర్పంచ్ ప్రమీలమ్మ, మాజీ సర్పంచులు వెంకటేశ్వరెడ్డి, శాంతన్న, వెంకటేశులు, మాజీఎంపీపీ మల్లికార్జున వైఎస్సార్‌సీపీ నాయకులు ఆంజనేయులు, శ్రీనివాసులు, కృష్ణ, ఎంపీడీఓ నరసింహమూర్తి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో సత్వర పరిష్కారం

ఎమ్మిగనూరు రూరల్: లోక్ అదాలత్ ద్వారా కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని మెజిస్ట్రేట్ గురుఅరవింద్ తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో మేలో జరిగే లోక్‌అదాలత్‌పై పోలీసులు, లాయర్లు ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ కాదలచిన కేసులను గుర్తించి లోక్ అదాలత్‌కు తీసుకురావాలన్నారు. స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగటం వల్ల సమయం వృథా అవుతందనే విషయాన్ని కక్షిదారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో పట్టణ సీఐ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ గురుఅరవింద్

రైతులకు చేయూత

పత్తికొండ రూరల్: రైతులకు సబ్సిడీ ద్వారా పశువులను ఇస్తున్నట్లు వ్యవసాయ అధికారి వెంకట్రాముడు తెలిపారు. శనివారం లబ్ధిదారులకు చిన్న హుల్తి సర్పంచు కేశవరెడ్డి ఆవును అందజేశారు. ఆవులు, మేకలు, కోళ్లను 50 శాతం రాయితీ కింద, దానిమ్మ, చీని పండ్లతోటల సాగుకు 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు వ్యవసాయాధికారి తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.


లబ్ధిదారులకు ఆవును అందిస్తున్న సర్పంచు కేశవరెడ్డి

గడేకల్ వృషభాల ప్రతిభ

చిప్పగిరి: శ్రీరామ నవమి సందర్భంగా నేమకల్లు గ్రామంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండ లాగుడు పోటీల్లో గడేకల్ వృషభాలు విజేతగా నిలిచాయి. 14 జతలు వృషభాలు పాల్గొన్నగా గడేకల్ పుట్టా భీమశేఖర్ యాదవ్ ఎద్దులు మొదటి స్థానం కైవసం చేసుకున్నాయి. రెండవ, మూడు, నాల్గవ స్థానాల్లో పెంచికలపాడు భీమలింగప్ప, ఆత్మకూరు గాండ్ల రవిచంద్ర, దాసొలాడి చిన్న పుల్లయ్య వృషభాలు నిలిచాయి. విజేత ఎద్ల యజమానులకు వరుసగా రూ.30,000, రూ.25,000, రూ.20,000, రూ.15,000 నగదు బహుమతులను దాతలు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ, ఎంపీపీ జూటూరు హేమలత, నాయకులు డేగులపాడు ప్రకాష్ రెడ్డి, చిప్పగిరి జువెల్లరీ షాప్ యజమాని ప్రతాప్ సహకారంతో అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.


బండలాగుతున్న వృషభాలు

ముస్లింల పవిత్ర స్థలం ఈద్గా

మద్దికెర: ఈద్గాను ముస్లింలు పవిత్ర స్థలంగా భావిస్తారని ప్రముఖ విరాళదాత పారా విశ్వనాథ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పెరవలిలో పారా రామన్న సేవా సమితి ఆధ్వర్యంలో రూ.15 లక్షలతో నిర్మించిన ఈద్గాను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం దాత విశ్వనాథ్‌ను ముస్లింలు ఘనంగా సన్మానించారు.


దాత పారా విశ్వనాథ్‌ను సన్మానిస్తున్న ముస్లింలు

వనం వేంకటేశునికి సింహవాహన సేవ


సింహవాహనంపై ఊరేగుతున్న స్వామి వారు

వెల్దుర్తి: రామళ్లకోట వనం శ్రీలక్ష్మీ వేంకటే శ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం గ్రామస్తులు స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు సింహవాహన సేవ నిర్వహించారు. గ్రామానికి చెందిన సుధాకర్ శెట్టి, గంగయ్య శెట్టి, సురేశ్ శెట్టిలు సేవాకర్తలుగా వ్యవహరించగా స్వామి వారు తన ఉభయ దేవేరులతో (భూదేవి, శ్రీదేవి) కలిసి అలంకారప్రాయుడై ముత్యాల పూల పందిరిలో సింహ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు.

భూములమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న చుంచు ఎర్రగుడి గ్రామస్తులు

కృష్ణగిరి: సేవ ముసుగులో ఆలయ భూములు అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలని చుంచు ఎర్రగుడి గ్రామస్తులు లక్ష్మీకాంతరెడ్డి, ప్రకాష్‌గౌడ్ తదితరులు డిమాండ్ చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. రామలింగేశ్వరస్వామికి సేవ చేసేందుకు ఇచ్చిన భూమిని జంగం కృష్ణయ్య.. దేవనకొండ మండలం పి.కోటకొండకు చెందిన గిడ్డయ్యకు అమ్మి రిజిస్ట్రేషన్ చేయించడం తగదన్నారు. అక్రమంగా అమ్మిన, కొన్న వారితో పాటు సహకరించిన వ్యక్తులపై కూడా చర్యలు తీసుకుని ఆలయ భూములను కాపాడాలని కోరారు.

జలజీవన్ మిషన్‌తో ఇంటింటికి కుళాయి

గోనెగండ్ల: జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి తాగునీటి కుళాయి వేయనున్నట్లు ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రంగనాయకులు తెలిపారు. శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ హైమవతి ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓహెచ్ఆర్ ట్యాంక్‌ల నిర్మాణానికి రూ.3.50 కోట్లు విడుదలయ్యాయన్నారు. త్వరలో పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

కేంద్రంపై సీపీఐ పోరాటం

ఆస్పరి: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ పోరాడుతోందని పార్టీ మండల కార్యదర్శి విరుపాక్షి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీపీఐ కార్యకర్తల సమావేశంలో విరుపాక్షి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పరిపాలనలో ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు కోరుతూ ఈనెల 14 నుంచి 30వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు అంజినయ్య, బ్రహ్మయ్య, క్రిష్ణమూర్తి, బడేసాహెబ్, దస్తగిరి, రామాంజనేయులు, నరసప్ప, మల్లన్న, కృష్ణ, హనుమంతు, చంద్ర, రంగస్వామి పాల్గొన్నారు.

ముగిసిన వేలంపాటలు

ఆలూరు: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని బస్టాండు, వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్ వేలంపాటలను శనివారం ఈఓ కృష్ణ కుమార్ సమక్షంలో నిర్వహించారు. బస్టాండును రూ.7,76000 వెంకటలక్ష్మి, వారపు సంతను రూ.2,60.000కు నాగరాజు, దినసరి కూరగాయల మార్కెట్‌ను రూ.4,49,000కు వెంకటలక్ష్మి దక్కించుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఏడాదితో రూ.6,69,000 ఆదాయం తగ్గిందని ఈఓపీఆర్డీ ఎం.ప్రకాష్ నాయుడు, ఈఓ కృష్ణకుమార్ తెలిపారు. ఈనెల 8వ తేదీలోగా పాడిన మొత్తాన్ని చెల్లించకపోతే వేలంపాటలు రద్దు చేస్తామన్నారు.

70 శాతం పన్ను వసూలు

ఆలూరు రూరల్: మండలంలో 70 శాతం పన్ను వసూలు చేసినట్లు ఈఓపీఆర్డీ ప్రకాష్ నాయుడు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి 16 గ్రామ పంచాయతీలలో పన్నులు, పన్నేతర రూపంలో గతంలోని బకాయిలు కలిపి రూ.1,38,38,214 రావాల్సి ఉండగా మార్చి చివరి నాటికి రూ.81,22,969 వసూలు చేశామన్నారు. మిగతా రూ.57,15,245 ఈ నెలాఖరులోగా వసూలు చేస్తామన్నారు.

భూముల రీసర్వేకు సహకరించండి

వెల్దుర్తి: భూముల రీసర్వేకు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ రాజేశ్వరి కోరారు. శనివారం మండల పరిధిలోని బుక్కాపురం గ్రామంలో ఆర్డీఓ కార్యాలయ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ కేవీ సుబ్బారెడ్డితో కలిసి ఆమె గ్రామసభ నిర్వహించారు. ఈనెల 3 నుంచి గ్రామ పరిధిలోని భూముల రీసర్వే ప్రారంభమవుతుందని, రైతులు పొలాల వద్ద ఉండి హద్దులు చూపాలన్నారు. సర్వే అనంతరం భూమికి సంబంధించి క్యూఆర్ కోడ్‌తో మ్యాప్ ఇస్తామన్నారు. సభలో సర్వేయర్ హేమంత్ కుమార్ రెడ్డి, ఆర్ఐ అబ్దుల్ కలాం, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్ రెడ్డి, పరమేశ్వరరెడ్డి వీఆర్ఓ, వీఆర్ఏలు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం

గోనెగండ్ల: జగనన్న స్వచ్ఛ సంకల్పం కింద గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుస్తున్నట్లు డీపీఓ నాగరాజు నాయుడు తెలిపారు. శనివారం మండల పరిధిలోని ఎర్రబాడు గ్రామంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని, సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు పది పరీక్షలపై అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ప్రతి రోజూ విద్యార్థులకు వడ్డించాలన్నారు.


కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయభారతి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.